సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

మంగళవారం । 7 । మార్చి । 2023



తోటలు దగ్ధం

జి.మాడుగుల: భీరం పంచాయతీ తాడివీధి వద్దగల రెండు ఎకరాల్లోని కాఫీ, మిరియాలు, సిల్వర్‌వోక్ తోటలు ఆదివారం దగ్ధమయ్యాయి.



గిరిజనులకు గోవుల అందజేత

పలువురు గిరిజనులకు సింహాచలం దేవస్థానం గోశాలలోని దేశవాలీ గోవులను దేవస్థానం అధికారులు అందజేశారు. 8లో



వైఎస్సార్‌సీపీతోనే అభివృద్ధి

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఏజెన్సీ ఎంతో అభివృద్ధి చెందుతోందని ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. 8లో

న్యూస్‌రీల్

స్పందనకు 57 అర్జీలు



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న పీవో, సబ్ కలెక్టర్‌లు

రంపచోడవరం: స్థానిక ఐటీడీఏ సమావేశం హాల్‌లో సోమవారం నిర్వహించిన స్పందనలో ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే, రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్, ఏపీవో జనరల్ సీహెచ్ శ్రీనివాసరావులు 57 అర్జీలు స్వీకరించారు. కొన్ని సమస్యలు వెంటనే పరిష్కరించి, మరి కొన్ని సమస్యల అర్జీలను సంబంధిత అధికారులు పంపినట్టు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే తెలిపారు. రోడ్ల నిర్మాణం, భూ సమస్యలు పరిష్కరించాలని, స్కూల్‌ను తెరిపించాలని, ఇతర సమస్యలపై అర్జీలు వచ్చినట్టు ఆయన చెప్పారు. తున్నూరు సర్పంచ్ సాదల విజయ భాస్కరరెడ్డి, దాలిపాడు సర్పంచ్ వెంకాయమ్మ, పాతకోట సర్పంచ్ గొర్లె రేవతి తదితరులు అర్జీలు అందజేశారు. స్పందనలో డివిజన్ స్థాయి అధికారలు పాల్గొన్నారు.

యువతకు ఉపాధి కల్పనే ప్రభుత్వ లక్ష్యం



సౌకర్యాల గురించి తెలుసుకుంటున్న ఏపీఎస్ఎస్‌డీసీ చైర్మన్ అజయ్‌రెడ్డి

అరకులోయ రూరల్: యువతకు ఉపాధి కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఏపీఎస్ఎస్‌డీసీ చైర్మన్ అజయ్‌రెడ్డి తెలిపారు. స్థానిక వైటీసీ శిక్షణ కేంద్రం, ప్రభుత్వ ఐటీఐ కళాశాలను సోమవారం ఆయన సందర్శించారు. వివిధ ట్రేడుల్లో శిక్షణ పొందుతున్న వారితో మాట్లాడి అక్కడ సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన నిరుద్యోగులకు హోటల్ మేనేజ్ మెంట్,టైలరింగ్,మెకానిక్,వెల్డింగ్, హౌస్‌కీపింగ్, ఎలక్ట్రికల్ వెహికల్ టెక్నీషియన్ తదితర కోర్సుల్లో శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాలను యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కల్పన జిల్లా నైపుణ్య అధికారి ప్రశాంత్‌కుమార్,ఐటీఐ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


విస్తృతంగా వాహన తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

వై.రామవరం: మండలం కేంద్రం వై.రామవరం శివారులో సోమవారం ఎస్ఐ ఎం.సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. మావోయిస్టు నేత జనుమూరి శ్రీనుబాబు అలియాస్ సునీల్ అలియాస్ రైనో అరెస్టుతో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైన విషయం తెలిసిందే.ఒకపక్క మావోయిస్టు నేత అరెస్టు, మరో పక్క గంజాయి రవాణా అవుతోందని అందిన సమాచారం మేరకు సోమవారం వారపుసంత సందర్భంగా తనిఖీలు జరిపారు. కొత్త వ్యక్తులపై ఆరా తీశారు. తనిఖీల్లో సీఆర్‌పీఎఫ్ డి42 బెటాలియన్ పోలీసులు పాల్గొన్నారు.

చుక్కల జింకకు తీవ్ర గాయాలు



గాయాలతో ఉన్న చుక్కల జింక

రాజవొమ్మంగి: సింగంపల్లి గ్రామం వద్ద వేటగాళ్ల ఉచ్చులో పడి ఓ చుక్కల జింక తీవ్రంగా గాయపడింది. ఫారెస్ట్‌సెక్షన్ ఆఫీసర్ బాలాజీ అందజేసిన వివరాలు ఇలాఉన్నాయి. వేటగాళ్ల ఉచ్చులో పడిన సుమారు ఒకటిన్నర సంవత్సరాల వయసుగల ఆడ జింక పెనుగులాడుతూ తప్పించుకుంది. సంఘటనా స్థలానికి కొంత దూరంలో గాయాలతో పడిపోయి ఉన్న జింకను స్థానికులు గుర్తించి అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఆ ప్రాంతానికి వెళ్లి జింకను స్వాధీనం చేసుకున్నట్టు ఎఫ్ఎస్‌వో బాలాజీ తెలిపారు. జడ్డంగి పశువుల డిస్పెన్సరీలో చికిత్స చేయించామని, జింక పరిస్థితి విషమంగా ఉందని ఆయన చెప్పారు. ఉచ్చు వైరు నడుము చుట్టూ బిగుసుకుని లోతుగా కోసుకుపోవడం వల్ల వెన్నుపూస బాగా దెబ్బతిందని తెలిపారు. ఉర్లాకులపాడు నర్సరీలో ఉంచి చికిత్స చేస్తున్నట్టు తెలిపారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

ఆస్పత్రుల్లో హా..రం



పాడేరు ఆస్పత్రిలో రోగులకు భోజనం వడ్డిస్తున్న సిబ్బంది

- మెస్‌చార్జీలు డబుల్..మెనూ సూపర్
- ఆస్పత్రుల్లో రోగులకు మరింత రుచికరంగా పౌష్టికాహారం
- రోగుల సహాయకులకు కూడా మూడు పూటలా అందజేత
- ఈనెల ఒకటో తేదీ నుంచి కొత్త మెనూ అమలు

సాక్షి,పాడేరు: ఆస్పత్రుల్లో రోగులకు అందించే ఆహారంలో ప్రభుత్వం సమూల మార్పులు తీసుకు వచ్చింది.మెనూ చార్జీలను రెట్టింపు చేసింది. గతంలో రోగికి మూడుపూటలా ఆహారం పంపిణీకి రోజుకు రూ.40మాత్రమే మెస్ చార్జీలు ఇచ్చేవారు. ఇప్పుడు రోగులకు మెరుగైన వైద్యసేవలతో పాటు వారు పూర్తిగా కోలుకునేంత వరకు నాణ్యమైన, రుచికరమైన పౌష్టికాహారాన్ని మూడు పూటలా అందించే లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మెస్ చార్జీలను రెట్టింపు చేశారు. రోజుకు రూ.80 చొప్పున మెస్ చార్జీలు ఇస్తుండడంతో వైద్యబృందాలు,రోగులు,వారి కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.గత నెలలో టెండర్లను ఆస్పత్రుల వారీగా పిలిచారు. నిబంధనల మేరకు ఖరారు చేయడంతో ఈనెల 1వతేదీ నుంచి కొత్త మెనూ అమలవుతోంది. జిల్లాలో రోగితో పాటు సహాయకుడికి కూడా మూడు పూటలా పౌష్టికాహారాహాన్ని అందజేస్తున్నారు. ఆస్పత్రుల్లో రోజువారీ ఆహారం పంపిణీని పకడ్బందీగా అమలుచేయాలన్న ప్రభుత్వ ఆదేశాలతో ఆస్పత్రి సూపరింటెండెంట్‌లు, ఆ సమయంలో విధులు నిర్వహించే వైద్యులు, సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు.

9 ఆస్పత్రుల్లో అమలు

పాడేరులోని జిల్లా ఆస్పత్రి, మరో 8 వైద్యవిధాన పరిషత్ ఆస్పత్రుల్లో కొత్త మెనూను అమలుజేస్తున్నారు. పాడేరు జిల్లా ఆస్పత్రిలో 200 బెడ్‌లు, అరకులోయ ఏరియా ఆస్పత్రిలో 150, చింతపల్లి ఏరియా ఆస్పత్రిలో 100,రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో 100బెడ్‌లు, ముంచంగిపుట్టు, అడ్డతీగల,వై.రామవరం,చింతూరు,కూనవరం కమ్యూనిటీ ఆస్పత్రుల్లో 30 బెడ్‌లు చొప్పున ఉన్నాయి. వైద్యవిధాన పరిషత్ ఆధీనంలోని 9 ఆస్పత్రుల్లో ప్రతి రోజూ 700మంది రోగులకు,వారి సహాయకులు మరో 700మందికి పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నారు.రోగుల కోసం ఆహారం తయారు చేసేందుకు ఉపయోగించే నిత్యావసర సరకులు కూడా నాణ్యంగానే ఉండాలని టెండర్ల ఖరారులోనే ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది.ఫైన్ బియ్యం, నాణ్యమైన వంటనూనెలు,సీజనల్‌గా దొరికే నాణ్యమైన కూరగాయలు,ఆకుకూరలు,చట్నీలకు సంబంధించి బెంగాల్‌గ్రామ్ లేక వేరుశనగ గింజలను వాడాలని, సాంబారును కూడా నాణ్యం తయారు చేయాలని సూచించింది.గుడ్డు తినని పక్షంలో ఆ రోగికి 100 మిల్లీలీటర్ల వేడి పాలు అందజేయాలని మెనూ ఉత్తర్వుల్లో పేర్కొంది





పాడేరు జిల్లా ఆస్పత్రిలో అందజేసిన భోజనంతో బాలుడు, గిరిజన మహిళ

మెనూ వివరాలు

ఉదయం అల్పాహారం (7.30 నుంచి 8.30 గంటల వరకు)

- మూడు ఇడ్లీ,100ఎంఎల్ సాంబారు లేక చట్నీ
- మరో రోజు పొంగల్/కిచిడీ/ఉప్మా, చట్నీతో, 5బ్రెడ్ ముక్కలు
- కప్ టీ /వేడి పాలు

మధ్యాహ్న భోజనం(12 నుంచి 1.00)

- ఫైన్ బియ్యంతో అన్నం/ పుల్కాలు
- కాయగూరల కర్రీ, ఉడికించిన గుడ్డు,200ఎంఎల్ పెరుగు / బట్టర్‌మిల్క్,అరటిపండు

రాత్రి భోజనం(6నుంచి 8వరకు)

- ఫైన్ బియ్యంతో అన్నం/6పుల్కాలు కాయగూరల కర్రీ, సాంబారు, ఉడికించిన గుడ్డు

భోజనం రుచిగా ఉంది



పాడేరు జిల్లా ఆస్పత్రిలో నాలుగు రోజుల నుంచి వైద్యసేవలు పొందుతున్నాను. మూడు పూటలా మంచి ఆహారం అందజేస్తున్నారు. ఉదయం టిఫిన్,మధ్యాహ్నం,రాత్రి గుడ్డుతో కూడిన రుచికరమైన భోజనం పెడుతున్నారు.నాతో ఉన్న సహాయకుడికి కూడా ఆహారం అందుతోంది.

–సీదరి చిక్కుడు, లువ్వాసింగి గ్రామం, జి.మాడుగుల మండలం

మెనూ కచ్చితంగా అమలు



ప్రభుత్వ ఆదేశాల మేరకు నాణ్యమైన మెనూను కచ్చితంగా అమలుచేస్తున్నాం. జిల్లా ఆస్పత్రి పాడేరుతో పాటు అన్ని వైద్యవిధాన పరిషత్ ప్రాంతీయ ఆస్పత్రులు,సీహెచ్‌సీల్లో కొత్త మెనూ చార్టులను ఏర్పాటు చేస్తున్నాం. ఆహారం పంపిణీని వైద్యబృందాలు పర్యవేక్షిస్తున్నాయి. ఆహారం పంపిణీలో ఎలాంటి లోపాలు ఉన్నా 75694 08826, 89197 11089 అనే ఫోన్ నంబర్లకు సమాచారం ఇవ్వవచ్చు.

– డాక్టర్ శంకర్‌ప్రసాద్, వైద్యవిధానపరిషత్ జిల్లా సమన్వయకర్త, పాడేరు

భారీగా పెట్టుబడులు చరిత్రాత్మకం

- జీఐఎస్ విజయవంతం సీఎం జగన్ పాలనా దక్షతకు నిదర్శనం
- ఎంపీ మాధవి,ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి



కేక్ కట్ చేస్తున్న ఎంపీ మాధవి, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

సాక్షి,పాడేరు: విశాఖలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ విజయవంతంకావడం, రాష్ట్రంలో రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావడం చరిత్రాత్మకమని అరకు ఎంపీ మాధవి, ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మిలు హర్షం వ్యక్తం చేశారు. సమ్మిట్ విజయవంతం కావడంతో ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి తన క్యాంపు కార్యాలయంలో సోమవారం విజయోత్సవాన్ని నిర్వహించారు. ఎంపీ,ఎమ్మెల్యేలు విజయోత్సవ కేక్‌కట్ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జాతీయ,అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలు రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి ముందుకు రావడం శుభపరిణామమన్నారు. దిగ్గజ పారిశ్రామిక వేత్తలు అంబానీ, ఆదానీ కూడా సమ్మిట్‌లో పాల్గొనడం సీఎం జగన్ పరిపాలనపై ఉన్న నమ్మకాన్ని రుజువు చేస్తోందన్నారు. కొత్తపరిశ్రమల ఏర్పాటుతో గిరిజన ప్రాంతాల యువతకు కూడా మేలు జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఎస్.రత్నకుమారి,పార్టీ గ్రీవెన్స్‌సెల్ జిల్లా అధ్యక్షుడు గొడ్డేటి మహేష్, మండల పార్టీ అధ్యక్షుడు సీదరి రాంబాబు,ఎంపీటీసీలు గిడ్డి విజయలక్ష్మి, చిట్టెమ్మ,రామకృష్ణపాత్రుడు,కోటి,సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ తెడబారికి సురేష్ కుమార్,వ్యవసాయ సలహామండలి జిల్లా అధ్యక్షురాలు సరస్వతి,సర్పంచ్ సీతమ్మ,మార్కెట్‌కమిటీ డైరెక్టర్ రామసత్యవతి,మాజీ ఎంపీపీ మంగ్లన్నదొర పాల్గొన్నారు.

పగలు సెగలు.. రాత్రిళ్లు వణుకు!

- కనిష్ట, గరిష్ట ఉష్ణోగ్రతల మధ్య నాలుగు రెట్ల వ్యత్యాసం
- ఉమ్మడి విశాఖలో కనిష్టం 10 డిగ్రీలు
- గరిష్ట ఉష్ణోగ్రతలు 39 డిగ్రీల నమోదు
- సీజన్ మార్పు వల్లే అంటున్న నిపుణులు



ఎండ నుంచి రక్షణకు గొడుగుతో వెళ్తున్న మహిళ

సాక్షి, విశాఖపట్నం: పగలు సెగలు.. రాత్రి వేళ వణుకు.. కొద్ది రోజుల నుంచి ఉమ్మడి విశాఖ జిల్లా వాసులకు ఇలాంటి అనుభూతే కలుగుతోంది. శీతాకాలం వెళ్లిపోయినా ఇప్పటికీ రాత్రి పూట చలి గజగజ లాడిస్తోంది. అంతేకాదు పగటి, రాత్రి ఉష్ణోగ్రతల మధ్య ఎంతో వ్యత్యాసం ఉంటోంది. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో కనిష్ట (రాత్రి) ఉష్ణోగ్రతలకంటే గరిష్ట (పగటి) ఉష్ణోగ్రతలు దాదాపు నాలుగు రెట్ల అధికంగా ఉంటూ ప్రజానీకాన్ని ఒకింత ఆశ్చర్య చకితులను చేస్తోంది. కొద్ది రోజుల నుంచి అల్లూరి సీతారామరాజు జిల్లాలో పలుచోట్ల రాత్రి ఉష్ణోగ్రతలు 9–10 డిగ్రీలు నమోదవుతున్నాయి. అదే జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు 36 డిగ్రీలు పైగా రికార్డవుతున్నాయి. అనకాపల్లి జిల్లాలోనూ పరిస్థితి అలాగే ఉంది. కనిష్ట ఉష్ణోగ్రతలు 15 డిగ్రీలు, గరిష్ట ఉష్ణోగ్రతలు 39 డిగ్రీల వరకు ఎగబాకుతున్నాయి. ఇక విశాఖపట్నం జిల్లాలో రాత్రి ఉష్ణోగ్రతలు 16, పగటి ఉష్ణోగ్రతలు 38 వరకు నమోదవుతున్నాయి. అంటే వీటి మధ్య వ్యత్యాసం గరిష్టంగా 24 డిగ్రీల వరకు ఉంటోందన్న మాట! ఉదాహరణకు సోమవారం నాటి ఉష్ణోగ్రతలను పరిశీలిస్తే.. ఏఎస్సార్ జిల్లాలోని హుకుంపేట 10, జీకేవీధిలో 10.2, చింతపల్లి 10.4, అరకు 10.6, పాడేరు 10.7, జి.మాడుగుల10.8 డిగ్రీలు, అనకాపల్లి జిల్లాలోని మాడుగులలో 14.8, మాకవరపాలెం 15.4, నక్కపల్లిలో 15.6, గొలుగొండలో 15.7, అనకాపల్లి 16.9, నర్సీపట్నంలో 17.9 డిగ్రీలు, విశాఖ జిల్లా పెందుర్తిలో 16.3, భీమిలి 17.9, ఆనందపురం 18, విశాఖ ఎయిర్‌పోర్టులో 19 డిగ్రీల చొప్పున కనిష్ట ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. ఇక గరిష్ట ఉష్ణోగ్రతల విషయానికొస్తే ఏఎస్సార్ జిల్లాలోని పాడేరులో 36, జీకేవీధి 33.2, చింతపల్లి 32.8, హుకుంపేట 32 డిగ్రీలు, అనకాపల్లి జిల్లాలోని మాకవరపాలెంలో 39, అనకాపల్లి 38.4, రోలుగుంట, మునగపాక, సబ్బవరం, పరవాడ, కె.కోటపాడు, గొలుగొండల్లో 38, నక్కపల్లిలో 37 డిగ్రీల చొప్పున రికార్డయ్యాయి. ఫలితంగా పగటి ఉష్ణోగ్రతలు సాధారణంకంటే 2–4 డిగ్రీలు అధికంగాను, కనిష్ట ఉష్ణోగ్రతలు 2–5 డిగ్రీలు తక్కువగాను నమోదవుతున్నాయి. దీంతో వాతావరణం మధ్యాహ్నం సమయంలో మండు వేసవిని, రాత్రి వేళ శీతాకాలాన్ని తలపిస్తోంది. ఇలా మార్చి ఆరంభంలోనే పగలు వివిధ పనులపై బయటకు వెళ్లే వారు వేసవి తాపాన్ని చవి చూస్తున్నారు. ఇళ్లలో ఉంటున్న వారు ఫ్యాన్లు, ఏసీలను తప్పనిసరిగా వినియోగిస్తున్నారు. రాత్రి పూట చలి కాలంలో మాదిరిగానే దుప్పట్లు, రగ్గులను కప్పుకుని నిద్రిస్తున్నారు. అంతేకాదు.. రాత్రి పొద్దుపోయాక రోడ్లపై ప్రయాణించే వారు వణికిపోతూ కనిపిస్తున్నారు. వీరు చలి నుంచి ఉపశమనం పొందడానికి మఫ్లర్లు, స్కార్ఫ్‌లు వంటివి ధరిస్తున్నారు.

సీజన్ మారే వేళ

శీతాకాలం నుంచి వేసవికాలంలోకి సీజను మారే సమయంలో ఇలాంటి వాతావరణ మార్పు చోటు చేసుకుంటుందని వాతావరణ అధికారులు చెబుతున్నారు. ఇలాంటి సమయంలో గాలిలో తేమ శాతం తగ్గుతుందని, పగటి ఉష్ణోగ్రతలు పెరిగి, రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గుతాయని విశాఖలోని తుపాను హెచ్చరికల కేంద్రం అధికారి ఒకరు 'సాక్షి'కి చెప్పారు. అందువల్లే పగటి వేళ వేసవితాపం, రాత్రి సమయంలో శీతల వాతావరణంతో చలి ప్రభావం చూపుతాయని వివరించారు. మరికొద్ది రోజులు ఇదే పరిస్థితి కొనసాగుతుందని, ఆ తర్వాత సాధారణ స్థితికి చేరుకుంటుందని తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు సిద్ధం కావాలి

కలెక్టర్ సుమిత్ కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్,పక్కన ఎస్పీ సతీష్‌కుమార్,జేసీ,సబ్‌కలెక్టర్

సాక్షి,పాడేరు: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ఈనెల 13న జరిగే పోలింగ్‌కు పాడేరు డివిజన్‌లో అధికారులు సిద్ధం కావాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. ఐటీడీఏ సమావేశ మందిరంలో ఎన్నికల జోనల్,రూట్,నోడల్,ప్రిసైడింగ్ అధికారులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

15 పోలింగ్ కేంద్రాలు

పాడేరు డివిజన్‌లో 1,525 మంది పట్టభద్రుల ఓటర్లు ఉన్నారని, 15 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. ఐదుజోన్లు, ఐదు రూట్లుగా విభజించామని,డిస్ట్రిబ్యూషన్,రిసెప్షన్ కేంద్రాలతో పాటు తాత్కాలిక స్ట్రాంగ్‌రూమ్‌ను కూడా పాడేరులోని తలారిసింగి ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటు చేశామన్నారు. పీవోలు,ఏపీవోలు 12వ తేదీ ఉదయం 8గంటలకు తలారిసింగి డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌కు చేరుకోవాలని,ఎన్నికల సామగ్రి, బ్యాలెట్ బాక్సులు తీసుకుని వారికి కేటాయించిన బస్సుల్లో జోనల్,రూట్ అధికారుల పర్యవేక్షణలో పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని ఆయన ఆదేశించారు. సొంత వాహనాల్లో ప్రయాణించవద్దని ఆయన ఆదేశించారు.

కేంద్రాల వద్ద అన్ని సౌకర్యాలు

ముందు రోజే అన్ని పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు,మరుగుదొడ్లు, ఇతర సౌకర్యాలను కల్పించాలని తెలిపారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.ఎప్పటికప్పుడు పోలింగ్ వివరాలను కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన కంట్రోల్‌రూమ్‌కు తెలియజేయాలన్నారు.పోలింగ్ ప్రక్రియ పూర్తి అయిన తరువాత ఒక్క కాగితం కూడా పోలింగ్ కేంద్రంలో విడిచిపెట్టకుండా,డస్ట్‌బిన్‌లోని వ్యర్థాలతో సహా కవర్లలో పెట్టి రిసెప్షన్ కౌంటర్‌లో అందజేయాలని చెప్పారు.ప్రిసైడింగ్ అధికారి డైరీ కీలకమన్నారు.బ్యాలెట్ పేపర్,పేపర్ సీల్ అకౌంట్లను జాగ్రత్తగా నమోదు చేయాలని సూచించారు

విస్తృత పోలీసు బందోబస్తు

పోలింగ్‌ను ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద విస్తృతంగా పోలీసు బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్టు ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. మూడంచెల విధానంలో పోలీసు బృందాలు విధులు నిర్వహిస్తాయని,పోలింగ్ సిబ్బంది ఎలాంటి భయాందోళనకు గురికాకుండా స్వేచ్ఛగా విధులు నిర్వహించాలన్నారు. ప్రతి రూట్‌లో ఆయా పోలీసు స్టేషన్ల అధికారులు భద్రతా చర్యలను పర్యవేక్షిస్తారని చెప్పారు. సమస్యలు ఉత్పన్నమైతే స్పెషల్ బ్రాంచి సీఐలు అన్నిశాఖల అధికారులతో సమన్వయం చేసుకుని పరిష్కరిస్తారని ఆయన తెలిపారు.అనుమానిత వ్యక్తులను బైండోవర్ చేస్తామని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో జేసీ శివశ్రీనివాస్,సబ్‌కలెక్టర్ అభిషేక్, డీఆర్వో అంబేడ్కర్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల జోనల్ ఇన్‌చార్జిల నియామకం

విజయనగరం: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, సీఎం వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అనుబంధ విభాగాల జోనల్ (శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం , అల్లూరి సీతారామరాజు జిల్లాల) ఇన్‌చార్జిలను నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

యువజన విభాగం: అవనాపు విక్రమ్ (విజయనగరం)
రైతు విభాగం: గొండు రఘురాం (శ్రీకాకుళం)
బీసీ సెల్: డాక్టర్ ధర్మాన చైతన్యకృష్ణ చైతన్య (నరసన్నపేట)
వైఎస్సార్‌టీయూసీ: వై.మస్తానప్ప (అనకాపల్లి)
పంచాయతీరాజ్ వింగ్: మేర్పాల సత్యనారాయణ (ఎస్.కోట)
ఎస్టీ సెల్: డీవీజీ శంకరరావు మాజీ ఎంపీ (పార్వతీపురం)
మైనారిటీ సెల్: ఇక్బాల్ హుస్సేన్ ఫరూక్ (విశాఖపట్నం ఈస్ట్)
విద్యార్థి విభాగం: బి.ఫణికుమార్ (ఎచ్చెర్ల)
వికలాంగుల విభాగం: దువ్వు అప్పలరామ్ (ఎస్.కోట)
వైఎస్సార్‌సేవాదళ్: పిన్నింటి గౌరునాయుడు (ఎచ్చెర్ల)
డాక్టర్స్ వింగ్: డాక్టర్ ఉలాల శేషుయాదవ్ (ఇచ్ఛాపురం)
వాణిజ్యవిభాగం: కుమ్మరిగుంట శ్రీనివాసరావు (విజయనగరం)
సాంస్కృతిక విభాగం: కొరగంజి ధర్మారావు (రాజాం)
పబ్లిసిటీ వింగ్: చింతాడ రవి (ఆముదాలవలస)
మహిళా విభాగం: డి.పద్మావతి (విశాఖప్నటం ఈస్ట్)
గ్రీవెన్స్ సెల్ విభాగం: డోల మన్మథకుమార్ (విజయనగరం)
వీవర్స్ వింగ్: బొమ్మాన వెంకటరమణ (చీపురుపల్లి)

నరసింగరావు, విశ్వప్రసాద్ నాయుడుల నియామకం

సాక్షి,పాడేరు: వైఎస్సార్‌సీపీలోని అనుబంధ విభాగాల జోనల్ ఇన్‌చార్జిలుగా జిల్లాలోని పాడేరుకు చెందిన ఇద్దరు నేతలకు అవకాశం లభించింది. విజయనగరం,విశాఖపట్నం,అనకాపల్లి జిల్లాల జోనల్‌లో వైద్యవిభాగానికి డాక్టర్ తమర్బ నరసింగ రావు,ఎస్టీ సెల్ జోనల్ ఇన్‌చార్జిగా కిముడు శ్రీనివాస విశ్వప్రసాద్‌నాయుడులను నియమించారు.

అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం

- మంత్రి అమర్‌నాథ్
- ధన్వంతరి అఖండ యాగంలో పాల్గొన్న గుడివాడ



పూజా కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి అమర్‌నాథ్, ఎంపీ మాధవి, ఎమ్మెల్యే పాల్గుణ, స్వాతిరాణి



పెట్టుబడులకు సంబంధించిన పోస్టర్ చూపిస్తున్న మంత్రి అమర్‌నాథ్ తదితరులు

అనంతగిరి: రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రెండు కళ్లు అని, సమప్రాధాన్యం ఇస్తున్నారని ఐటీ పరిశ్రమలశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. మండలంలోని గుమ్మకోట పంచాయతీ దుండవలసలోని ఆయుర్వేద వైద్యుడు రవివర్మ ఆధ్వర్యంలో జరుగుతున్న ధన్వంతరి అఖండ యాగంలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. అరకు ఎంపీ మాధవి, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, జీసీసీ చైర్‌పర్సన్ శోభ స్వాతిరాణితో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేంద్రం వద్ద 120 అడుగుల ఆయురమృత ఈశ్వరుడు విగ్రహ నిర్మాణ స్థలంలోని ప్రత్యేక పూజలు జరిపారు. ఆధ్యాత్మిక కేంద్రం విశిష్టత గురించి మంత్రికి రవివర్మ వివరించారు. అనంతరం గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ విజయవంతం ముగియడంతో గుమ్మకోట సర్పంచ్ అప్పారావు ఆధ్వర్యంలోని కేక్ కట్‌చేసి, ఎమ్మెల్యే, ఎంపీలకు తినిపించారు. ఈ సందర్భంగా మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ భావితరాల భవిష్యత్తు కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషిచేస్తున్నారని చెప్పారు. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ విజయవంతంగా సాగిందని, దేశవిదేశాలు నుంచి పెట్టబడులు పెట్టేందుకు పలు సంస్థలు ముందుకు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలోని ఎంపీపీ శెట్టి నీలవేణి, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ శోభ సోమేశ్వరి, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజా రమేష్, ఎస్టీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శెట్టి గంగాధర స్వామి, మండల పార్టీ అధ్యక్షుడు శెట్టి ఆనంద్, సర్పంచ్ అప్పారావు, ఎంపీటీసీ తవిటినాయుడు, కో ఆప్షన్ సభ్యుడు మదీనా, మార్కెట్‌యార్డు డైరెక్టర్ సూర్యనారాయణ, కన్వీనర్ సంపత్,నాయకులు కృష్ణమూర్తి, గంగులు, స్వామి,నగేశ్వరరావు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

డల్లాపల్లిలో సినిమా షూటింగ్ ప్రారంభం



షూటింగ్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎంపీ మాధవి, ఎమ్మెల్యేలు

పాడేరు రూరల్: మండలంలోని డల్లాపల్లి ఘాట్ మార్గం పరిసర ప్రాంతాల్లో సినిమా షూటింగ్ సందడి నెలకొంది. యూట్యూబ్ స్టార్ వైవా హర్ష హీరోగా నాయక్ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అరకు ఎంపీ మాధవి, అరకు,పాడేరు ఎమ్మెల్యేలు చెట్టి ఫాల్గుణ, కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి క్లాప్ కొట్టి ప్రారంభోత్సవం చేశారు. ఈ సినిమా మంచి విజయం సాధించాలని ఆకాక్షించారు. చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. డల్లాపల్లి పరిసర ప్రాంతాల్లో 40 రోజుల పాటు చిత్రం షూటింగ్ నిర్వహిస్తామని చిత్ర బృందం తెలిపింది. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు గొడ్డేటి మహేష్, రూఢకోట సర్పంచ్ కాతరి సురేష్‌కుమార్, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ తెడబారికి సురేష్‌కుమార్, జిల్లా సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు గంపరాయి దిలీప్‌కుమార్, మాజీ ఎంపీపీ సల్లంగి ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

గిరిజనులకు గోవుల అందజేత

సింహాచలం: అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన పలువురు గిరిజనులకు సింహాచలం దేవస్థానం గోశాలలోని దేశవాళీ గోవులను సోమవారం దేవస్థానం అధికారులు అందజేశారు. పెదబయలు మండలంలోని ఇంజరి, దమదంగి, కొత్తూరు, కింతలి గ్రామాల్లో పిడుగులు పడి సుమారు 150 పశు సంపదను గిరిజనులు కోల్పోవడంతో సింహాచలం దేవస్థానానికి చెందిన గోశాల నుంచి ఆయా గిరిజనులకు పశుసంపద అందజేయాలని ఆజిల్లా కలెక్టర్, ఎస్పీ లిఖితపూర్వకంగా దేవస్థానం అధికారులను కోరారు. ఇటీవల జరిగిన దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సమావేశంలో ఆ విషయంపై తీర్మానం చేసి సభ్యులు ఆమోదించారు. దీంతో సోమవారం అధికారులు 138 వరకు గోవులు, గిత్తలు, కోడెదూడలను అందజేశారు. అల్లూరి జిల్లా డీఎస్పీ కె.వెంకటరావు, మాడుగుల సీఐ ఎ. సత్యనారాయణ, పెదబయలు ఎస్‌ఐ మనోజ్‌కుమార్, అల్లూరి జిల్లా పశుసంవర్ధకశాఖ ఏడీ రాజారవి కుమార్ సమక్షంలో దేవస్థానం అధికారులు అందజేశారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు వారణాసి దినేష్‌రాజ్, పంచాడి పద్మ, దేవస్థానం గోశాల పర్యవేక్షకుడు హరి రాజు, ఏఈవో జంగం శ్రీనివాస్‌రావు, సూపరింటెండెంట్ పిల్లా శ్రీనివాసరావు, సీనియర్ అసిస్టెంట్ పల్లి సూరిబాబు పాల్గొన్నారు.

మోదకొండమ్మ ఉత్సవాల సమావేశం రేపు

సాక్షి, పాడేరు: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం పాడేరు మోదకొండమ్మతల్లి రాష్ట్ర వార్షిక జాతరను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. పాడేరు ఎమ్మెల్యే, ఆలయ కమిటీ చైర్‌పర్సన్ కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అధ్యక్షతన బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు ఇక్కడ ఆలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలంనాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో అమ్మవారి ఉత్సవాల నిర్వహణ తేదీలను ఖరారు చేస్తారన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే మన్యం అభివృద్ధి

- రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి
- సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో సమావేశం



చింతూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి

చింతూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఏజెన్సీ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతోందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. చింతూరు మండలంలోని సచివాయల కన్వీనర్లు, గృహసారథులు, ప్రజా ప్రతినిధులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏజెన్సీలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలు ఆపేస్తామని, ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతున్న సచివాలయం, వలంటీరు వ్యవస్థను రద్దు చేస్తామని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారని ఆమె తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీల పేరుతో దోపిడీ వ్యవస్థ కొనసాగిందని ఆమె విమర్శించారు. అప్పటి దోపిడీ వ్యవస్థ గురించి, ప్రస్తుత ప్రభుత్వ హయాంలోని సచివాలయం, వలంటీరు వ్యవస్థ ద్వారా నేరుగా లబ్ధిదారుల చెంతకే సంక్షేమ పథకాలు ఎలా చేరుతున్నాయో ప్రజలకు అర్థమయ్యేలా వివరించే బాధ్యత సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల దేనని ఆమె తెలిపారు. అనంతరం ఆమె గృహసారథులు, కన్వీనర్లకు ప్రభుత్వ పథకాల సమాచారంతో కూడిన కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ కమిషన్ సభ్యుడు చిచ్చడి మురళి, ఎంపీపీ సవలం అమల, వైస్ ఎంపీపీ మేడేపల్లి సుధాకర్, సొసైటీ చైర్మన్ శ్యామల విజయ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ య గుమంటి రామలింగారెడ్డి, కోట్ల కృష్ణ, కారం సాయిబాబు, పేపకాయల శ్రీను, పాపారావు, శివరామకృష్ణ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఎటపాక మండలంలో..

బుట్టాయిగూడెంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, ప్రజా ప్రతినిధులతో ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఇంటికీ వెళ్లి వారికి చేకూరిన లబ్ధిని వివరించడం ద్వారా పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకొచ్చే బాధ్యత గృహసారథులు, సచివాలయ కన్వీనర్లపై ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు ఉబ్బా సుష్మిత, ఎంపీపీ కాక కామేశ్వరి, సొసైటీ చైర్మన్ ఆకుల వెంకటరామారావు తదితరులు పాల్గొన్నారు.

మోదకొండమ్మ సేవలో ఏపీఎస్‌డీసీ చైర్మన్



అజయ్‌రెడ్డికి మోదకొండమ్మ చిత్రపటాన్ని బహూకరిస్తున్న బుల్లిబాబు

సాక్షి,పాడేరు: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం పాడేరులోని మోదకొండమ్మ తల్లిని ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ చైర్మన్ కె.అజయ్‌రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు, ఆలయ కమిటీ ప్రతినిధులంతా అజయ్‌రెడ్డికి దుశ్శాలువా కప్పి అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

వ్యాన్ ఎక్కిన బోటు



వ్యాన్‌పై ఉన్న భారీ బోటు..

ముంచంగిపుట్టు: నీటిపై వెళ్లే బోటు వ్యాన్ ఎక్కింది. వ్యాన్‌పై భారీ బోటును విశాఖపట్నం నుంచి ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి తరలిస్తూ సోమవారం ముంచంగిపుట్టు మండల కేంద్రంలో నిలుపుదల చేశారు. వ్యాన్ కన్నా బోటు పెద్దదిగా ఉండడం అందరూ ఆసక్తిగా చూశారు. దీనిని స్థానికులు సెల్ఫీలు,ఫొటోలు తీసుకుంటూ సందడి చేశారు.

రంగురాళ్ల తవ్వకాల్లో ఇద్దరి అరెస్టు



నిందితులు

నర్సీపట్నం: కరక రంగురాళ్ల క్వారీలో తవ్వకాలకు యత్నించిన ఇద్దరు వ్యక్తులను ఫారెస్టు అధికారులు అరెస్టు చేసి సోమవారం రిమాండ్‌కు తరలించారు. గొలుగొండ మండలం కరక రంగురాళ్ల ప్రాంతాన్ని అటవీ అధికారులు నిషేధిత ప్రదేశంగా పరిగణించారు. ఈ రంగురాళ్ల క్వారీ వద్ద బేస్ క్యాంపుతో పాటు మొబైల్ టీమ్ నిత్యం పర్యవేక్షిస్తోంది. అయినప్పటికీ అటవీ అధికారుల కళ్లుగప్పి తవ్వకాలు జరిపేందుకు నర్సీపట్నంకు చెందిన ఇద్దరు వ్యక్తులు క్వారీ ప్రాంతంలోకి చొరబడ్డారు. నిషేధిత ప్రాంతంలోకి చొరబడిన నర్సీపట్నం, కాపు వీధికి చెందిన పెదిరెడ్ల జనార్దన్(42), గొలుగొండ మండలం, గుండుపాల గ్రామానికి చెందిన వై.గణేష్(23)ను రేంజర్ పి.లక్ష్మీనర్సు అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో తవ్వకాలకు జరిపేందుకు వచ్చినట్టు అంగీకరించడంతో అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. న్యాయమూర్తి ఇద్దరికి 15 రోజులు రిమాండ్ విధించారు.వీరిని సబ్‌జైల్‌కు తరలించారు. రంగురాళ్ల తవ్వకాలకు యత్నించిన సంఘటనపై మరింత లోతుగా విచారణ చేస్తున్నామని రేంజర్ తెలిపారు.

కానిస్టేబుళ్లపై దాడి చేసిన నిందితుడికి రిమాండ్

గోపాలపట్నం (విశాఖ పశ్చిమ): ఇద్దరు కానిస్టేబుళ్లపై దాడికి పాల్పడిన వ్యక్తిని ఎయిర్ పోర్టు పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇటీవల కాకానినగర్ సాయి ప్రియా అపార్ట్‌మెంట్‌లో ఓ మహిళ 100 డయల్ చేయగా ఘటనా స్థలానికి వెళ్లిన ఎల్.కృష్ణారావు, కేవీవీ కిశోర్‌పై అల్లూరి సీతారామరాజు జిల్లా వెంగడ గ్రామానికి చెందిన గొమాంగి గోపీనాథ్ సుత్తితో దాడికి పాల్పడ్డాడు. నిందితుడ్ని కోర్టులో హాజరు పరచగా మేజిస్ట్రేట్ ఈ నెల 17 వరకు రిమాండ్‌కు విధించారు.

భార్యను హతమార్చిన భర్త అరెస్టు



అరెస్టయిన నిందితుడు, స్వాధీనం చేసుకున్న నాటు తుపాకీతో సీఐ అశోక్‌కుమార్, ఎస్సై

గూడెంకొత్తవీధి: మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వలేదని కట్టుకున్న భార్యనే నాటు తుపాకీతో కాల్చి చంపిన భర్తను సోమవారం గూడెంకొత్తవీధి పోలీసులు అరెస్టు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను గూడెంకొత్తవీధి సీఐ అశోక్‌కుమార్ విలేకరులకు వివరించారు. ఈ నెల 2న గూడెంకొత్తవీధి మండలం మొండిగెడ్డ పంచాయతీ గాలిమానువీధికి చెందిన గబులంగి రామచంద్రరావు(42) మద్యానికి డబ్బులు ఇవ్వలేదన్న కారణంతో ఆగ్రహానికి గురై ఇంటిలో నిద్రిస్తున్న తన భార్య విజయలక్ష్మిని నాటుతుపాకీతో కాల్చాడు. ఈ ఘటనలో ఆమె కుడి తొడపై తీవ్ర రక్తస్రావమై ఆమె మరణించింది. మద్యానికి బానిసైన రామచంద్రరావు తరచూ తన భార్యను వేధించేవాడు. సంఘటన జరిగిన రోజు కూడా కాఫీ గింజలు అమ్మగా వచ్చిన డబ్బులు తనకు ఇవ్వలేదన్న కారణంతో ఆమెపై విచక్షణా రహితంగా కాల్పులు జరిపి, ఆమె మరణానికి కారకుడైనట్టు సీఐ తెలిపారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, చింతపల్లి ఏఎస్పీ ప్రతాప్‌శివకిషోర్ ఆదేశాలమేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టామన్నారు. ఈ ఘటనకు పాల్పడి పరారయ్యేందుకు ప్రయత్నిస్తున్న రామచంద్రరావును సోమవారం ముల్లుమెట్ట వద్ద పట్టుకున్నట్టు వెల్లడించారు. నిందితుడి నుంచి నాటు తుపాకీని స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సై అప్పలసూరి, సిబ్బంది పాల్గొన్నారు.

తైడలోని టేకు తోట దగ్ధం



దగ్ధమవుతున్న టేకు తోట

అనంతగిరి: మండలంలోని ఘాట్‌రోడ్డు తైడ గ్రామానికి ఆనుకుని టేకు తోట సోమవారం రాత్రి దగ్ధమైంది. గ్రామానికి చెందిన కొంతమంది గిరిజనులు అరకు-విశాఖ ప్రధాన రహదారి ఆనుకుని టేకు మొక్కలు గతంలో వేసుకున్నారు. ఈ నేపథ్యంలో గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో టేకు తోట దగ్ధమైంది. గ్రామం చుట్టు, ప్రధాన రహదారి ఆనుకుని పెద్ద ఎత్తున మంటలు ఎగసిపడ్డాయి. అదుపు చేసేందుకు గిరిజనులు ప్రయత్నాలు చేపట్టినప్పటికి ఫలితం లేకపోయింది.

అగ్ని ప్రమాదంలో జీడితోట దగ్ధం



అగ్ని ప్రమాదంలో దగ్ధమైన జీడితోట

రోలుగుంట: మండలంలోని లగుడు కొత్తూరులో సోమవారం సాయంత్రం లగుడు వారి భూముల వద్దనున్న జీడి తోటలో అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన లగుడు అప్పలనాయుడు జీడి తోట రెండెకరాల విస్తీర్ణంలో దగ్ధమయింది. ఐతే ఈ ప్రమాదం ఎలా జరిగిందో తెలియరాలేదు. బాధితుడు అప్పలనాయుడికి ఎవరితోనూ శతృత్వం లేదని, తోవన పోయేవారు సిగరెట్టు కాల్చి పడేయడంతో ఎండిన ఆకుల్లో పడి మంటలు రేగి ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని స్థానికులు చెప్తున్నారు. తనకు జరిగిన నష్టంపై బాధితుడు విలపిస్తూ, ప్రభుత్వం నుంచి నష్టపరిహారం కోసం తహసీల్దార్‌ను ఆశ్రయించనున్నట్టు తెలిపాడు.

ఉరేసుకుని వృద్ధుడి మృతి

నాతవరం : నర్సీపట్నం, తుని మధ్య పెడిమికొండ అటవీప్రాంతం జీడి తోటలో చెట్టుకు ఉరి వేసుకుని గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్టు నాతవరం ఎస్‌ఐ డి.లక్ష్మినారాయణ తెలిపారు. ఎస్‌ఐ అందించిన వివరాలిలా ఉన్నాయి. తాండవ జంక్షన్ సమీపంలో వై.డి.పేట రెవెన్యూ పరిధిలో లాలం అచ్చియ్యమ్మకు చెందిన జీడితోటలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం చెట్టుకు వేలాడుతూ ఉన్నట్లు స్థానికులు సమాచారం ఇచ్చారు. సిబ్బందితో వెళ్లి తోటలో చెట్టుకు వేలాడుతున్న మృతదేహాన్ని పరిశీలించి సమీప గ్రామాలకు సమాచారం ఇచ్చారు. ఆచూకీ తెలియకపోవడంతో మృతదేహన్ని ఉన్నతాధికారుల అదేశాల మేరకు నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచినట్టు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి సుమారు 60 ఏళ్ల వయసుంటుందని, ఎత్తు 5.6 అడుగులు, చామన చాయ రంగు కలిగి, ఆకుపచ్చ నెక్ బనియన్ వేసుకుని ఉన్నట్టు పేర్కొన్నారు. ఆదివారం రాత్రి ఉరి వేసుకుని చనిపోయి ఉండవచ్చని భావిస్తున్నట్టు తెలిపారు. ఆచూకీ కోసం నాతవరం పోలీసు స్టేషన్‌కు గానీ, 8332970770, 08932 287633 నెంబర్లుకుగానీ సంప్రదించాలని కోరారు.

సైనిక్ స్కూల్ ఫలితాల్లో సత్తాచాటిన హరిణిశ్రీ

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో బాలికల విభాగంలో ప్రథమ స్థానం



చోడవరం రూరల్ : అనకాపల్లి జిల్లా చోడవరం మండలం ఖండేపల్లికి చెందిన పోతుల హరిణిశ్రీ సైనిక్ స్కూల్ ఆలిండియా ర్యాంకుతోపాటు ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని బాలికల విభాగంలో ఫస్ట్ ర్యాంకును సాధించి తన సత్తా చాటింది. మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్న హరిణిశ్రీ సైనిక్ ప్రవేశ పరీక్షలో 300 మార్కులకు గాను 273 మార్కులను సాధించింది. ఆలిండియా స్థాయిలో 332వ ర్యాంకు, బాలికల విభాగంలో 28వ స్థానంలో నిలిచింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన ఈ పరీక్షలో హరిణిశ్రీ భాషా విభాగంలో 48(50), గణితం 141(150), సాధారణ పరిజ్ఞానం 36(50), విజ్ఞానం 48(50) మార్కులను సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.అప్పలనాయుడు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించి పదో ర్యాంకులో నిలవగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని బాలికల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. పోతుల అప్పలనాయుడు, ప్రగతిల కుమార్తె హరిణిశ్రీ ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ ఇంతటి ప్రతిభ చూపడంపట్ల పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ దాడి మహాలక్ష్మినాయుడు, గ్రామ సర్పంచ్ శానాపతి రాజశేఖర్, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

మంటలార్పేందుకు వెళ్లి యువకుడి మృతి

కుమ్మర్ల గ్రామంలో విషాదం



శివాజీ మృతదేహం

కొయ్యూరు: అగ్ని ప్రమాదంలో జీడి తోటలను రక్షించాలని ప్రయత్నించిన యువకుడు తీవ్రంగా కాలిపోయి మరణించాడు. డౌనూరు పంచాయతీ కుమ్మర్లలో ఆదివారం సాయంత్రం ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఇక్కడ జీడి తోటల్లో అగ్ని ప్రమాదం సంభవించింది. గ్రామానికి చెందిన గెమ్మెలి శివాజీ(18) మంటలార్పేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో అతడు మంటల్లో చిక్కుకుని కాలిపోయాడు. తోటలకు చెందిన గెమ్మెలి చంద్రారావు, కొర్రా రాంబాబు, పాంగి రాజారావు, కొర్రా చిన్న వచ్చేటప్పటికే తీవ్ర గాయాలతో మరణించాడు. దాంతో కుమ్మర్లతో తీవ్ర విషాదం నెలకొంది. తోటలు కాలిపోతాయన్న ఆత్రుతలో వాటిని ఆపాలని తీవ్రంగా ప్రయత్నించాడని, ఆ సమయంలో తీవ్ర గాయాలతో మరణించాడని స్థానికులు, కుటుంబ సభ్యులు వాపోతున్నారు.

కలర్‌ఫుల్ పండగకు రెడీ



వసంత కాలంలో వచ్చే రంగుల హోళీ.. జీవితంలో నింపేనే సంతోష కేళీ.. అంటూ రంగుల పండగ సంబరాలకు నగరం సిద్ధమవుతోంది. హోలీ రంగులు జల్లుకునేందుకు సరికొత్త వస్తువులు మార్కెట్‌లో సందడి చేస్తున్నాయి. పిల్లలను ఆకర్షించేలా బ్యాక్ ప్యాక్ గన్స్, ఏకే 47, మిసైల్స్ రూపంలో కలర్‌ఫుల్ రంగుల కోసం గతంలో ఎన్నడూ లేని విభిన్నమైన ప్రొడెక్ట్స్ అందుబాటులోకి వచ్చాయని అక్కయ్యపాలెం మెయిన్‌రోడ్డులోని న్యూషాప్ ఓనర్ వెంకటేష్ చెబుతున్నారు.

సైబర్ టెక్ సెల్ ఏర్పాటులో ముందడుగు



సమావేశంలో పాల్గొన్న పోలీస్, ఐటీ ప్రతినిధులు

అల్లిపురం: సైబర్ సెక్యూరిటీ సెల్ ఏర్పాటులో నగర పోలీస్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ ముందడుగు వేశారు. ఈ మేరకు కమిషనర్ ఆదేశాల మేరకు సీఆర్ సీఐడీఎఫ్, న్యూఢిల్లీకి చెందిన పాటిబండ్ల ప్రసాద్ సమన్వయకర్తగా టెక్ మహీంద్రాలో విశాఖ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ గవర్నింగ్ బాడీతో సోమవారం నాలుగోసారి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా దేశ వ్యాప్తంగా జరుగుతున్న సైబర్ నేరాలను దృష్టిలో ఉంచుకుని సైబర్‌సేఫ్టీ, సెక్యూరిటీ, వుమెన్ అండ్ చిల్డ్రన్ సేఫ్టీ, రోడ్ సేఫ్టీ, ఇండస్ట్రియల్ కారిడార్ పరిరక్షణ, క్రైమ్ మానిటరింగ్ వంటి రక్షణ చర్యలు మరింత పగడ్బందీగా అమలయ్యే విధంగా చర్యలు తీసుకోవడంపై చర్చించారు. సొసైటీ ఫర్ విశాఖపట్నం సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ (వీసీఎస్‌సీ) ఏర్పాటు దిశగా నగర పోలీస్ కమిషనర్ ప్రత్యేక ప్రాధాన్యమిస్తూ సైబర్ సెల్ ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు. దీంట్లో భాగంగా సైబర్ నేరాలపై అవగాహన, మహిళల భద్రత, ఇతర స్థానిక నేరాల నియంత్రణ మీద ముందస్తు జాగ్రత్తలు, త్వరిత గతిన విచారణ జరపడం కోసం సైబర్ టెక్ సెల్ ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. సమావేశంలో ప్రముఖ ఐటీ కంపెనీ ప్రతినిధులు, ఫార్మా కంపెనీ ప్రతినిధులు, పోర్టు హాస్పిటాలిటీ అండ్ హోటల్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న ఆహ్వాన నాటిక పోటీలు




నాటికలోని ఒక దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని హరిపాలెం గ్రామంలో పారిపల్లెమ్మ పండగను పురస్కరించుకుని గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీలు ఆకట్టుకుంటున్నాయి. సోమవారం రాత్రి మూడు నాటిక ప్రదర్శనలు ఇచ్చారు. కరీంనగర్ వారి చీకటి పువ్వు, చిలకలూరిపేట వారి నాన్నా.. నేనొచ్చేస్తా, విశాఖపట్నం వారి ఇది కథ కాదు నాటికలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. మూడవ నాటికలో భోగస్ చిట్ ఫండ్ కంపెనీల గురించి కళ్లకు కట్టినట్లు చూపించారు.

తలనీలాల ఆదాయం రూ. 10.76 కోట్లు

- అప్పన్నకు భక్తులు సమర్పించే తలనీలాల వేలం
- సొంతం చేసుకున్న చెన్నైకి చెందిన దొరై ఎంటర్‌ప్రైజస్
- గత ఏడాది కంటే రూ.1.49 కోట్లు అధికం



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి భక్తులు సమర్పించే తలనీలాల ద్వారా రూ. 10కోట్ల 76లక్షల 89వేల 100 ఆదాయం లభించింది. దేవస్థానం చరిత్రలో తలనీలాల ద్వారా ఇంత పెద్ద మొత్తంలో ఆదాయం రావడం ఇదే తొలిసారి. వివరాల్లోకి వెళ్తే... ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి వచ్చే సంవత్సరం మార్చి 31 వరకు స్వామివారికి భక్తులు సమర్పించే తలనీలాలను విక్రయం జరిపేందుకు సోమవారం దేవస్థానం పరిపాలన కార్యాలయంలో బహిరంగ వేలం, సీల్డ్‌టెండర్, ఈప్రొక్యూర్‌మెంట్ నిర్వహించారు. చెన్నైకి చెందిన దొరై ఎంటర్‌ప్రైజస్, ఏలూరుకి చెందిన ఇండియన్ హెయిర్ ఇండస్ట్రీస్, సూర్యోదయ ఎంటర్‌ప్రైజస్, సికింద్రాబాద్‌కి చెందిన నాగకుమారి ఎంటర్‌ప్రైజస్, తిరుపతికి చెందిన గరుడ ఎంటర్‌ప్రైజస్ ప్రతినిధులు వేలంలో పాల్గొన్నారు. తొలుత బహిరంగ వేలం నిర్వహించగా చెన్నైకి చెందిన దొరై ఎంటర్‌ప్రైజస్ 9 కోట్ల 52 లక్షలకు హెచ్చుపాట పాడింది. అనంతరం సీల్డ్ టెండర్లు తెరవగా అందులో కూడా అదే సంస్థ రూ.10కోట్ల 76 లక్షల 89వేల100 హెచ్చుమొత్తానికి కోట్ చేసింది. అనంతరం సాయంత్రం దేవస్థానం అధికారులు ఈ ప్రొక్యూర్‌మెంట్‌ని పరిశీలించగా అందులో రూ.10కోట్ల 66లక్షల 5వేల హెచ్చుమొత్తానికి ఇండియన్ హెయి ర్ ఇండస్ట్రీస్ కోట్ చేసింది. మూడు ప్రక్రియల్లో సీల్డ్ టెండరు ద్వారా చెన్నైకి చెందిన దొరై ఎంటర్‌ప్రైజస్ కోట్ చేసిన హెచ్చుమొత్తాన్ని అధికారులు పరిగణలోకి తీసుకుని ఆమోదం కోసం దేవదాయశాఖ కమిషనర్‌కు పంపించారు. కాగా గత ఏడా ది తలనీలాల ద్వారా రూ.9 కోట్ల 27 లక్షలు ఆదాయం లభించింది. దీంతో ఈ ఏడాది అదనంగా మరో రూ.కోటి 49లక్షల 89వేల 100 ఆదాయం లభించింది. దేవస్థానం పరిపాలన కార్యాలయంలో ఏఈవో జంగం శ్రీనివాస్, సూపరింటెండెంట్ పిల్లా శ్రీనివాస్ వేలం నిర్వహించారు.

మహిళా దినోత్సవ క్రీడా పోటీలు

విశాఖ స్పోర్ట్స్: క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలకు క్రీడాపోటీలు నిర్వహించనున్నారు. ఈనెల 8 నుంచి 25వ తేదీ వరకు పలు వేదికల్లో ఈ పోటీలు అన్ని వయస్సుల వారికి నిర్వహించనున్నారు. 8న ర్యాలీ నిర్వహించనుండగా 9న అథ్లెటిక్స్, 10న బాస్కెట్‌బాల్, 11న కబడ్డీ పోటీలతో పాటు యోగా, సంప్రదాయక పోటీలు జరగనున్నాయి. ఆయా పోటీల్లో పాల్గొనే వారు స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలోని డీఎస్‌ఏ కోచ్‌లను సంప్రదించవచ్చని వీడీసీఏ చీఫ్ కోచ్ సూర్యారావు తెలిపారు.